

మూఢ నమ్మకాలను విడనాడాలి

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజనులు మూఢనమ్మకాలు, గంజాయి రవాణా వంటి వాటికి దూరంగా ఉండాలని అరకు సీఐ హిమగిరి, స్థానిక ఎస్సై శ్రీనివాస్ సూచించారు. బుధవారం కాశీపట్నంలో జరిగిన వారపు సంతలో వివిధ మారుమూల గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారుమూల గ్రామాలలో ఉన్న గిరిజనులు మూఢనమ్మకాలతో ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. గంజాయి వంటి మత్తు పానీయాలను రవాణా చేయవద్దని, దీనిలో కేసు నమోదయితే కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో మోసపోవద్దని సూచించారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిఐ

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధనకు...

ఆందోళన ఉధృతం



ఆందోళన చేస్తున్న గిరిజన స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీ స్పెషల్ డిఎస్ సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఎను బుధవారం గిరిజన నిరుద్యోగులు ముట్టడించారు. ముందుగా మోదకొండమ్మ ఆలయం నుంచి మెయిన్ బజార్ మీదుగా ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో బారికేడ్లను తోసుకుని ఐటిడిఎ గేటు వరకు చేరుకుని ఆందోళన చేపట్టారు. సిఐ దీనబంధు ఎపిఒ వెంకటేశ్వరరావును కార్యాలయం నుంచి బయటకు పిలిపించి వినతిపత్రం అందజేయించారు. కొంతసేపు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఆదివాసీ అధికార్ మంచ్ జాతీయ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ.. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అధికారంలోకి వస్తే జిఒ-3 ప్రయోజనాలను పునరుద్దరిస్తామని అరకులో జరిగిన ఎన్నికల సభలో సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఆ హామీని అమలు పరచకుండా ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ తో ఆదివాసీ నిరుద్యోగులకు తీరని నష్టం జరుగుతుందన్నారు.మెగా డిఎస్ సి నోటిఫికేషన్ లో ఏజెన్సీ పోస్టులు మినహాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీచేసి ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీల కోసం ప్రత్యేక డిఎస్ సి ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయుటకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర మాట్లాడుతూ, జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్ తో ఆదివాసీ నిరుద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. 5వ షెడ్యూల్డ్ క్లాజ్ -2 ప్రకారం టిఏసి రూపొందించిన రెగ్యులేషన్ 1 ఆఫ్ 21 ఆన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకొనే ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు మెగా డిఎస్ సి నోటిఫికేషన్ జారీతో ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని వివరించారు. గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ కై ఆర్డినెన్స్ జారీ చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కె.కాంతారావు డిమాండ్ చేశారు. డిఇఒ కేంద్ర కమిటీ ప్రతినిధి ఎస్.మాణిక్యం మాట్లాడుతూ ప్రభుత్వం మెగా డిఎస్ సిపై పున్ణపరిశీలన చేయాలని గిరిజన స్పెషల్ డిఎస్ సి సాధన కమిటీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. ఏప్రిల్ 30నాటికి ప్రభుత్వ ప్రకటన చేయాలని ఆదివాసీలు కోరినా నేటికి స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిఎస్ సాధన కమిటీ నాయకులు కూడ రాధ కృష్ణ, దీసరి గంగరాజు, చిన్నస్వామి, పి.బాల్‌దేవ్, ధర్మానపడాల్, సలీం, వి.మహేశ్వరరావు, పి.దేముడు, కూడ సుబ్రహ్మణ్యం, టి.కృష్ణారావు, ఎస్.కొండలరావు, కెజియరాణి, వి.నాగేశ్వరావు, వి.దాస్, సింహాద్రి, వైకుమార్, డి.శంకర్, పాత్రుడు రాధా, ఎం.వెంకటరాజు, ఆర్.ప్రశాంత్ కుమార్, ఎం.చిరంజీవి, చిన్నారి, నరేష్, బాలరాజు, భాను, లక్ష్మణరావు, జీవన్, కార్తీక్, మోహన్, రాంబాబు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న సురేంద్ర, అప్పలనర్సన, గంగరాజు తదితరులు



ఎపిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సితోనే ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం

రంపచోడవరం : ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ద్వారానే ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని జిఒ3కు చట్టబద్దత కల్పించాలని కోరుతూ బుధవారం రంపచోడవరం నిరసన ప్రదర్శన చేసిన ఐటిడిఎ వద్ద ధర్నా చేపట్టారు. ఐటిడిఎ పిఒ బయటకు వచ్చి వినతిపత్రం స్వీకరించాలని నినాదలు చేశారు. పిఒ బయటకు రాకపోవడంతో ఆందోళనకారులు లోపలకు వెళ్లడానికి ప్రయత్నించగా, ఇప్పటికే అక్కడకు మొహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన నిరుద్యోగులు మండుటెండను సైతం లెక్క చేయకుండా ఐటిడిఎ ఎదురుగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో సుమారు 3 గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అనంతరం నిరసన ప్రదేశానికి వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 400 పోస్టులకు గాను ఎస్టీలకు కేవలం 24 పోస్టులు మాత్రమే కేటాయించారని తెలిపారు. ఆదివాసీలకు 6శాతం, గిరిజనేతరులకు 94శాతం పోస్టులు కేటాయించడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. దీనిని పున:పరిశీలన చేసి ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి విడుదల చేయాలని కోరారు. నూరు శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసి, ప్రత్యేక డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల కూటమి నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, తీగల బాబురావు, సిపిఎం జిల్లా నాయకులు మట్ల వాణిశ్రీ, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, గిరిజన నిరుద్యోగులు పాల్గొన్నారు.

చింతూరు : డిఎస్సి ప్రకటించి 100శాతం ఉద్యోగాలు ఆదివాసీ నిరుద్యోగులకు ఇవ్వాలని కోరుతూ బుధవారం చింతూరు ఐటీడీఏ ముందు వివిధ ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల నాయకులు, నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రత్యేక హక్కులు, చట్టాలను పాలకులు నీరుగారుస్తున్నారని, ఉన్నత చదువుల్లోకి ఆదివాసీలు అడుగు పెడుతున్న సమయంలో ఈ విధంగా కోర్టుల ద్వారా జీవోలను రద్దు చేయించి ఆదివాసీల మనుగడనే ప్రశ్నార్థకంగా మార్చడం అన్యాయమన్నారు. ఆదివాసీల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు ఎంపీలు సైతం ఆదివాసులకు జరిగే అన్యాయం కోసం మాట్లాడకపోవడం అనేది చాలా బాధాకరమన్నారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, జిల్లా నాయకులు సీసం సురేష్ పూణెం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు సున్నం రాజులు, పల్లపు వెంకట్ ఆదివాసి అడ్వకేట్ మడివి రవితేజ మద్దతు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘ నాయకులు సోడా రాఘవయ్య మినప నాగేశ్వరరావు సోడా ప్రసాద్ నిరుద్యోగ అభ్యర్థులు అగరం సుబ్బలక్ష్మి ధారావత్ లావణ్య గొర్రె మేన, శేషయ్య కారం సుబ్బారావు పూడిఎం లక్ష్మణ్, సోడి శేషయ్య పాల్గొన్నారు.



చింతూరులో ర్యాలీ చేపడుతున్న నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రూ 500 కోట్లతో పరిశ్రమల పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో రూ.500 కోట్లతో పరిశ్రమల పార్కులు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా పరిశ్రమల అధికారులు, వ్యవసాయ, ఉద్యాన వన శాఖ ట్రాన్స్కో అధికారులతో పరిశ్రమల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొలుగొండ మండలంలో పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయడానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ 250 ఎకరాలను గుర్తించడం జరిగిందన్నారు. డుంబ్రిగుడ మండలం అరకులో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంపెక్స్ నిర్మాణానికి మే 1వ తేదీన శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్లో అరకు బ్రాండ్ పేరున కాఫీ, మిరియాలు, పసుపు,చిరుధ్యాన్యాలు, ఇతర గిరిజన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎంఎస్ఎం ఇలను ప్రోత్సహిస్తామన్నారు. పి.యం. విశ్వకర్మ తదితర వాటిపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, సహాయ సంచాలకులు రమణారావు, వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.సంద్, జిల్లా ఉద్యానవన అధికారి పి.రమేష్ కుమార్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి లక్ష్యం

ప్రజాశక్తి-పాడేరు:వ్యవసాయానుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్వర్ణాంధ్రా ప్రణాళికలపై కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలులో వ్యవసాయ శాఖ, ఉద్యానవన, సెరీకల్చర్, పశు సంవర్ధక శాఖ పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానుబంధ రంగాల్లో గణనీయమైన వృద్ధి సాధించాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవన సాగును విస్తరించాలన్నారు. మండలాన్ని యూనిట్ గా తీసుకుని కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. మండల స్థాయిలోను, ఐటిడిఏ పరిధిలోను, జిల్లా స్థాయిలోను వర్క్షాపులు నిర్వహించాలన్నారు. పదిహేను శాతం వృద్ధి సాధించడానికి ఎటువంటి ప్రణాళికలు తయారు చేసారో పూర్తి సమాచారంతో వర్క్షాపులకు అధికారులు హాజరు కావాలని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ పెడితే ప్రయోజనం ఉంటుందా ? ఎక్కడ పెట్టాలి అనే అంశాలపై అవగాహన ఉండాలన్నారు.ఈ సమావేశంలో రంప చోడవరం పి.ఓ కె.సింహాచలం పర్చువల్‌లోను, అసిస్టెంట్ కలెక్టర్ కసల చిరంజీవి నాగ వెంకట్ సాహిత్ ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.సంద్, జిల్లా ఉద్యానవన అధికారి పి.రమేష్‌కుమార్‌రావు, జిల్లా సెరికల్చర్ అధికారి అప్పారావు, జిల్లా పరిశ్రమల అధికారి రవి శంకర్, సిపి ఓ ఎస్ ఎస్ ఆర్ కె పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు..

మన్యం బంద్‌ను జయప్రద్రం చేయాలి

ప్రజాశక్తి-చింతూరు

ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించి 100శాతం ఉద్యోగాలు ఆదివాసీ నిరుద్యోగులకు ఇవ్వాలని కోరుతూ మే 2న జరుగు రాష్ట్రవ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతం బంద్‌ను జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివాసీ నిరుద్యోగులకు, ఉద్యోగులకు జరిగే అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ జరుగు బంద్‌లోప్రతి ఒక ఆదివాసి మన్యం బిడ్డ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీలేరు : ఆదివాసీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగం గిరిజనులతో నియామకాలు చేపట్టాలని కోరుతూ మే 2న జరుగు మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని దండకారణ్యం విమోచన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లో మనోజ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ జిఒ3ను సుప్రీంకోర్టు కొట్టవేయడంతో నేడు ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు.

ఘనంగా మారెమ్మ మారుపూజ ఉత్సవం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో మారెమ్మ అమ్మవారి మరుపూజ ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మారెమ్మ అమ్మవారి 53వ వార్షిక మహోత్సవం ఈనెల 14న ప్రారంభం కాగా, 27న ప్రధాన పండుగ ఘనంగా జరిగిన విషయం విధితమే. ప్రధాన పండుగ రోజు అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, వస్త్రాలకు ఆలయ కమిటీవారు వేలంపాట నిర్వహించారు. ఒక్కొక్క చీర 100 రూపాయల నుంచి సుమారు రూ.500 వరకు వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలు భక్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తోడం రాంబాబు ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోగా ఆ కుటుంబానికి కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరు కృష్ణ అర్జున్‌రావు, గ్రామ పెద్ద తోడం.రాజు చేతుల మీదుగా బియ్యం, దుప్పట్లు, బకెట్, చాప, నూనె బాటిల్, సబ్బులు, కూరగాయలు వంటి నిత్యవసర సరుకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తోడం బూబమ్మ మాట్లాడుతూ మారుమూల గ్రామమైన చొక్కనపల్లి గ్రామానికి వచ్చి అగ్ని బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించడం అనేది చాలా గొప్ప విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తోడం రాజు, పులి ధర్మరాజు, వార్డ్ మెంబర్ గొంది ధారయ్య, తోడం అనీల్, తోడం మంగమ్మ, తోడం సీతారామరాజు, నోముల శ్రీనివాసరావు, బాగుల శ్రీనివాసరావు, గొల్ల వెంకన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నిత్యావసరస సరుకులు అందిస్తున్న కృష్ణార్జున ఫౌండేషన్ ప్రతినిధులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించేదెప్పుడు?


ప్రజాశక్తి -అడ్డతీగల

అడ్డతీగల మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ప్రారంభించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మండలంలోని ఎల్లవరం, పాపంపేట ఏరియా పరిధిలో సుమారుగా 2000 ఎకరాలు రబీ సీజన్‌లో వరి పంట వేయడం జరిగింది. దానికి వ్యవసాయ శాఖ వారు సీఎంఆర్ నమోదు చేయడం చేశారు. పంట చేతికొచ్చినా దానిని అమ్ముకోవడానికి ప్రభుత్వ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతన్నలు ప్రైవేటు వ్యాపారులకు కారుచౌకగా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దళారులు ఇష్టారాజ్యంగా దోచుకోవడంతో ఒక బస్తా ధాన్యానికి సుమారు రూ.400 వరకు రైతు నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రైతన్నకు భరోసా కల్పించేలా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై ఏపీ పౌరసరఫరాల డిఎం గణేష్ కుమార్‌తో ప్రజాశక్తి ఫోన్లో మాట్లాడగా ఈ సమస్యను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని చెప్పారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోతే అడ్డతీగల ఏరియాలో వ్యవసాయదారులకు అన్యాయం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీ పరిధి మొద్దులగూడెం, తోటపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ కుంజ రమేష్ డిమాండ్ చేశారు. ఈ గ్రామాల్లో తాగునీటి ట్యాంక్ ద్వారా ఈనెల 18వ తేదీ నుండి నీళ్లు రావట్లేదని, నీళ్లు ఎక్కే పైపులకు రంధ్రాలు పడి నీళ్లు మొత్తం కిందే కారిపోతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులకు ఎన్నో మార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.10 లక్షలతో పైపులైను వేశారని, కాని నేటికీ మంచి నీళ్లు అందించకుండా వదిలేశారని తెలిపారు. ఈ విషయాన్ని చాలా సార్లు అడగ్గా వేసవి సీజన్ వచ్చాక చూద్దాంలే అని రాజుపేట గ్రామపంచాయతీ సెక్రెటరీ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చెప్పారని పేర్కొన్నారు. కాని ఇప్పటివరకు దానిని చూసిన పాపన పోలేదన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామానికి వెంటనే మంచినీళ్లు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే పంచాయితీ కార్యాలయాన్ని ఖాళీ బిందెలతో ముట్టడిస్తామని హెచ్చరించారు.



పని చేయని తాగునీటి పథకం

రహదారిపైకి వాలిన చెట్టుతో ఇబ్బందులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్ దారాలమ్మ ఆలయం దిగువన ప్రధాన రహదారిపై చెట్లు వాలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు వచ్చే పోయేటప్పుడు ప్రయాణికులు కిందికి దిగి రహదారిపై వాలిపోయిన చెట్టు పక్కకు లాగి వాహనాలు ముందుకెళ్లే పరిస్థితి నెలకొంది. దీనిపై చింతపల్లి డివిజన్ ఆర్ అండ్ బి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో వాహన చోదకులు అప్రమత్తంగా లేకపోతే పెను ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఆందోళన చెందుతున్నారు. గాలి వర్షాలకు రహదారిపై చెట్లు, బండ రాళ్లు పడుతుండగా, వాటిని వెంటనే తొలగించేందుకు ఆర్ అండ్ బి అధికారలు చర్యలు చేపట్టకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదాదరిపై రవాణా సౌకర్యానికి ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహన చోధకులు డిమాండ్ చేస్తున్నారు.



తమ వాహనం వెళ్లడానికి చెట్టుకొమ్మను పక్కకు నెడుతున్న దృశ్యం





చంద్రయ్య, నరేష్ మృతదేహాలు

బైక్‌ను ఢీకొన్న ఆటో

- ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-విఆర్.పురం

ద్విచక్ర వాహనాన్ని బజాజ్ ఆటో బలంగా ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం శబరిరాయిగూడెం సమీపంలో జరిగింది. రామవరం పంచాయితీకి చెందిన కారం చంద్రయ్య, మడకం నరేష్ విఆర్ పురంలో క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్ పాల్గొని తిరిగి తమ స్వగ్రామం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వారిని బజాజ్ మ్యాక్స్ ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించి నరేష్ చింతూరు ఏరియా ఆసుపత్రిలోనూ, కారం చంద్రయ్య భద్రాచలం ఆసుపత్రిలోనూ మృతి చెందారు. సమాచారం అందుకున్న విఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ సంతోష్ కుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్‌ను ఢీకొట్టిన బజాజ్ మ్యాక్సి ఆటో డ్రైవర్ నూలు సురేష్‌గా గుర్తించారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో పలు గ్రామాల్లో మలేరియా నిర్మూలనకు దోమల నివారణ మందును బుధవారం పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్ బుధవారం పరిశీలించారు. బుధవారం పాములేరు, కూడూరు, కడుమూరు, తూరు మామిడి గ్రామాల్లో 165 ఇళ్లలో మలేరియా స్ప్రేయింగ్ చేశారు. గ్రామస్తులు ముందుకు వచ్చి మలేరియా స్ప్రేయింగ్ చేయించుకోవాలని, దోమతెరలను వాడాలని, ఇంకుడు గుంతలను ప్రతి ప్రతి ఇంటిలో ఏర్పాటు చేసుకోవాలని ఎంపిడిఒ సూచించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎన్ఎం రత్నకుమారి, కృష్ణవేణి, సుధ హెల్త్ అసిస్టెంట్ పొన్నయ్య, ప్రభావతి ఎంటీఎస్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.



దోమల నివారణ మందు పిచికారిని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మొన్న వెంకన్న... నేడు అప్పన్న కొండపై..

పోయింది సర్కారు పరువు
అధికార నిర్లక్ష్యానికి ఏడుగురు బలి...


సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
విశాఖలో సింహాచలేశుని ప్రాంగణం రక్తసిక్తమైంది. ఈ ఏడాది జనవరిలో తిరుపతి వెంకన్న కొండపై తొక్కిసలాటలో ఆరుగురు, తాజాగా సింహాద్రి అప్పన్న కొండపై ఏడుగురు ప్రాణాలు హరీ మన్నాయి. దీంతో బాధితుల ఆర్తనాదాలు ఆకాశాన్నంటాయి. ఏడు కొండలపై ఆరుగురు, అప్పన్న కొండపై ఏడుగురు బలయ్యారన్న మాటలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లతెల్ల వారుతున్న వేళ 3.30గంటలకు విషాద దుర్ఘటన సింహాచలం కొండపై చందనోత్సవం సందర్భంగా చోటుచేసుకుంది. గాలి వానకు కొండపైగల గోడ కూలి రూ.300 క్యూ లైన్‌లో భక్తులపై పడిపోవడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన విశాఖ జిల్లానే కాదు యావత్ రాష్ట్రాన్నే కుదిపేసింది. జనం ఎక్కువైపోయి తిరుపతిలో మాదిరిగా తొక్కిసలాట జరిగిందా అంటే గోడ కూలడంతో ఇంత పెద్ద విపత్తు సంభవించింది. నాణ్యతా లోపం, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇటీవల కొండపై 10 రోజుల ముందు ప్రారంభించి ఐదు రోజుల్లోనే నిర్మించిన గోడ తెల్లారుజామున కురిసిన వర్షానికి గోడ పక్క నుంచి నీరు పారి 12 అడుగుల ఎత్తుగల గోడ దిగువ భాగం డొల్ల అయిపోవడంతో కూలిపోయిందని అధికారులు నిర్ధారించారు. బస్టాండ్ ఎదురుగా వైకుంఠ ద్వారం వైపు ఈ ఘోరం చోటుచేసుకుంది. ఐతే ఎండాకాలం అయినందున భక్తులు ఎండ వేడి తట్టుకోడానికి గోడపై నుంచి వేసిన రేకులు, ఐరన్ పైపులు కూలి గోడపై పడిపోయాయి. గోడ దెబ్బ, ఐరన్ రాడ్లు, రేకుల బరువుకు ఎదురుగు భక్తులు ఊపిరి ఆడకుండా అక్కడికక్కడే మృతిచెందారన్నది స్పష్టమవుతోంది. ఈ ఘటనలో పురుషులు నలుగురు, మహిళలు ముగ్గురు మరణించారు.


రోధిస్తున్న సాఫ్ట్‌వేర్ దంపతుల కుటుంబీకులు

'కూటమి'కి మాయని మచ్చ....
ప్రభుత్వ నిర్లక్ష్యం, పనుల్లో స్వార్థం వెరసి 'కొండ' చరిత్రకు మాయని మచ్చగా నిలిచాయి. పనుల్లో నాణ్యతా లోపం, గోడ నిర్మాణంలో జాగ్రత్తలను గాలికొదిలేయడం వెనుక అవినీతి పరాకాష్టకు చేరినందునే ఈ ఘోరం జరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో తిరుమల కొండపైనా తొక్కిసలాట భక్తుల మరణం, తాజాగా సింహాద్రి అప్పన్న కొండపై ఏడు ప్రాణాలు హరించుకుపోయాయి. దీంతో చంద్రబాబు పాలనా ప్రతిష్ట, కూటమి ప్రభుత్వం పరువు పోయినట్టయింది. జిల్లా అధికార యంత్రాంగం సైతం సింహాచలం కొండపై అప్పన్నను దర్శించుకునేందుకు వెళ్లే ప్రజలపై కాకుండా ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికార పార్టీకి చెందిన చోటా నాయకుల సేవలోనే తరించిందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందించాలని ఆదేశిస్తూ గోడ కూలిన ఘటనపై సమగ్ర విచారణకు ముగ్గురు సభ్యుల (త్రిసభ్య) కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. మృతులకుటుంబానికి రూ. 25లక్షలు, క్షతగాత్రులకు రూ. 3లక్షలు ప్రభుత్వం ఇస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మృతుల కుటుంబంలో ఒకరికి దేవాదాయ శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం హామీ ఇచ్చారు.


మహాలక్ష్మి | వెంకటరత్నం | మహేష్ | శైలజ | దుర్గస్వామినాయుడు | మణికంఠ ఈశ్వరశేషు

మృతులు వీరే
మృతిచెందిన వారిలో 1. ఎడ్ల వెంకటరావు (45) పాత అడవివరం ఎపిఆర్ స్కూల్ దగ్గర (విశాఖపట్నం), 2. పత్తి దుర్గా స్వామినాయుడు (33) మాచవరం తూర్పుగోదావరి జిల్లా, 3. పిల్లా ఉమామహేశ్వరరావు (30) చంద్రంపాలెం మధురవాడ, 4. పిల్లా శైలజ (30) చంద్రంపాలెం మధురవాడ, 5. పైల వెంకటరత్నం (50) 6.గుజ్జరి మహాలక్ష్మి (55), 7.కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషు (28), మాచవరం, అంబాజీపేట తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారున్నారు.

ప్రముఖుల సంతాపం:
గోడ కూలిన ఘటనపై రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, వైసిపి మహిళా నాయకులు పేడాడ రమణకుమారి, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్కడే ఉండి పరామర్శించని అశోక్...
బుధవారం తెల్లవారు జామున సింహాచలం కొండపై మాన్సాస్ చైర్మన్, మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు తొలి పూజలను అందుకోవడానికి విచ్చేసి, ఘటన జరిగిన సమయంలో గుడి లోపలే ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కనీసం ఘటనా స్థలానికి వచ్చి గోడ కూలి మృతి చెందిన వారిని పరామర్శించలేదని, కొండ దిగి వెళ్లిపోయారన్న చర్చ ఈ ప్రాంత ప్రజల్లో జరుగుతుంది.

ఘటన జరిగిన నుంచీ హోంమంత్రి పర్యవేక్షణ
సింహాచలం కొండపై గోడ కూలి ఏడుగురు భక్తులు మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెల్ల వారు జామునే కొండకు చేరుకొని సహాయక చర్యలను అక్కడే ఉండి పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలవరకూ కెజిహెచ్‌లో ఉన్నారు. పోస్టుమార్టం పూర్తయి భౌతికకాయాలను బంధువులకు అప్పగించేవరకూ ఆమె విశ్రమించకుండా పనిచేసారన్న చర్చ సాగుతోంది.


సింహాచలం కొండపై ఘటనా స్థలంలో పర్యవేక్షిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ తదితరులు

హెల్త్ కమిటీల ఏర్పాటుకు సహకరించాలి
ప్రజాశక్తి - అనంతగిరి: మండలంలోని 24 పంచాయతీ గ్రామాలలో హెల్త్ కమిటీలను ఏర్పాటు కు సహకరించాలని అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి ని ఎయిమ్స్ ప్రతినిధులు కోరారు. ఎయిమ్స్ కోఆర్డినేటర్ దిలీప్, సిబ్బందితో కలిసి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామస్థాయి హెల్త్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందని మహిళా సర్పంచ్‌లు ఉన్నచోట సర్పంచులు చైర్మన్లుగా ప్రతి గ్రామం నుంచి ఒకరికి ప్రాతినిధ్యం ఉండేలా సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. మహిళా సర్పంచులు లేనిచోట అవగాహన కలిగిన మహిళలను చైర్మన్లుగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీల విధివిధానాలపై పూర్తిస్థాయిలో చర్చించేందుకుగాను మండల స్థాయి సర్పంచులు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కమిటీ ఏర్పాటుకు సహకరించాలని ఎంపీపీని కోరారు. ఈ నెలలో జరిగే మండల సమావేశంలో కమిటీల ఏర్పాటుపై చర్చించేందుకు అవకాశం కల్పిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు.

రంగురాళ్ల తవ్వకాలపై ప్రత్యేక నిఘా
డివిజనల్ అటవీ శాఖ అధికారి నరసింహారావు
ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి అటవీ రేంజ్ పరిధిలోని దొడ్డికొండ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల కోసం అక్రమ తవ్వకాలు జరుగుతుంటే గోతులను సిమెంట్ కాంక్రీట్‌తో మూసివేసినట్లు డివిజనల్ అటవీశాఖ అధికారి వై వి నరసింహారావు వెల్లడించారు. దొడ్డికొండ అటవీ ప్రాంతంలో ఆయన బుధవారం పర్యటించారు. అటవీ కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట వ్యవహారాలపై గట్టి నిఘా ఏర్పాటుచేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సత్కారం
ప్రజాశక్తి - పెదబయలు: స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి మేనేజర్ ఒల్లేసు గాసి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. పాడేరు బ్రాంచి డివిజనల్ మేనేజరు బుక్క వెంకటేశ్వర్లు హాజరయ్యారు. బ్రాంచి మేనేజరు తో పాటు పెట్రోల్ బంకు మేనేజర్ కొండలరావు కూడా పదవి విరమణ కావడంతో ఇరువురిని ఘనంగా వివిధ మండలాల జీ సీ సి బ్రాంచి మేనేజర్లు కాంట్రాక్ట్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోదాము సూపరింటెండెంట్ సాగిన దీన కుమార్, చంద్రశేఖర్, ప్రెస్ క్లబ్ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎపిఎ ప్రభాకర్‌రావు సేవలు మార్గదర్శకం
ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ ఎపిఎ (జనరల్) విఎస్ ప్రభాకర్‌రావు సేవలు మార్గదర్శకమని ఎపిఓ (టిడబ్ల్యు) ఎం.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో బుధవారం ఎపిఎ ప్రభాకర్ రావు పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. వీడ్కోలు సమావేశానికి వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. టిడబ్ల్యు శాఖలో మూడు దశాబ్దాల పాటు మచ్చలేని అధికారిగా సేవలు అందించారని కొనియాడారు. 50 మంది ఐఎఎస్ అధికారుల సారథ్యంలో పనిచేశారన్నారు. ఐటిడిఎలో మొట్టమొదటిసారిగా కంప్యూటర్లను వినియోగించడంలో ఆయనే మొదటి వ్యక్తిని అన్నారు. సన్మాన గ్రహీత విఎస్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ టిడబ్ల్యు శాఖలో పనిచేసే గిరిజనులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. టిడబ్ల్యు డిడి ఎల్.రజని, డిఆర్డిఎ పిడి వి.మురళి, ఐటిడిఎ పరిపాలనాధికారి ఎం.హేమలత, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్ కుమార్, జిల్లా సెరికల్చర్ అధికారి అప్పారావు, ఎపిఎంఐపి పిడి రహీం పాల్గొన్నారు.

ఉత్సాహంగా కుర్చీ పోటీలు
ప్రజాశక్తి- డుంబ్రిగుడ: సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు కుర్చీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాల అధికారిని ఎస్ సునీత మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలు లాంటివని ప్రతి ఒక్కరూ విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయాలను అలవర్చుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే సుబ్బారావు, చిన్నారులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో వర్షం
ప్రజాశక్తి-డుంబ్రిగుడ:- మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మేఘాలు కమ్మేసి ఉంటూ రెండు గంటల తర్వాత వర్షం కురిసింది. కించుమండలో వర్షం కురవడంతో సంతకు వచ్చిన గిరిజనులు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు

మెగా డిఎస్‌సితో ఆదివాసీ నిరుద్యోగులకు అన్యాయం
ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ మినుముల సుధీర్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ కళ్యాణ మండపం వద్ద బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మన్యం ప్రాంతంలో ఉన్న ఐటీడీఏ పరిధిలో మే 2వ తేదీన చేపట్టే మన్యం బంద్‌ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీలో ఆదివాసి గిరిజన నిరుద్యోగులందరికీ పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. అది మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీగా భావిస్తున్నామన్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియా ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని రాజ్యాంగంలో ఉన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతు న్నాయన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరకువేలిలో ప్రకటన చేసి నేటికీ సంవత్సరం కావస్తున్నప్పటికీ ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కోర్ర త్రినాథ్, మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, నాయకులు సిరిగం గంగూలీ, పవన్, ఎం రమేష్ , మఠం జగన్నాథం పడాల్, వంతల లైకోన్, శ్రావణ్, సూర్యనారాయణ, చందు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

బందులో గిరిజన ప్రజానీకం పాల్గొవాలి
జిమాడుగుల: మే 2 నుండి జరగబోయే బందుకు సన్నద్ధం కావాలని డీఎస్సీ సాధన కమిటీ కన్వీనర్ మత్స్యరాస నారాయణ రాజు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన మెగా డీఎస్సీలో వేలాదిమంది ఆదివాసీ డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ తో మెగా డీఎస్సీ నిర్వహిస్తే వేలాదిమంది గిరిజన. డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తు అంధకారంలో పోతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వారు న్యాయం చేయాలని తెలుపుతున్నారు.

ఆర్‌ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఆర్ఐటిఐ)లో మొదటి విడత ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ప్రకటనలో పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ (40 సీట్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (24), ఫిట్టర్ (20), వెల్డర్ (40), ప్లంబర్ (24), వుడ్ వర్క్ టెక్నీషియన్ (24), స్టెనోగ్రాఫర్ (24) కోర్సుల్లో ప్రవేశాల కొరకు ఈ ప్రకటన జారీ చేశారు. అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను సమీప ప్రభుత్వ ఆర్‌ఐటిఐకి తీసుకెళ్లి మే 26 లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కౌన్సెలింగ్‌ను జూన్ మొదటి వారంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9866108607, 9494377833 నెంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

బసవేశ్వరుడికి ఘన నివాళి
ప్రజాశక్తి-పాడేరు : 12వ శతాబ్దపు తత్వవేత్త, కవి, సంఘ సంస్కర్త బసవేశ్వరుడు జయంతిని ప్రతి ఏడాది ఏప్రిల్ 30న జరుపుకుంటామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. లింగాయత్ ఉద్యమ స్థాపకుడిగా బసవన్న శక్తివంతమైన బోధనల దారా సమానత్వం, న్యాయం కోసం కృషి చేసారని కొనియాడారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బసవన్న దార్శనికత కుల, వివక్ష రహిత సమాజం కోసం పరితపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ కె. చిరంజీవి నాగ వెంకట సాహిత్, డిఆర్ఓ కె. పద్మలత, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల జిల్లా అధికారులు ఎస్బిఎస్ నంద్, రమేష్ కుమార్‌రావు, నరసింహులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు తిరుమలఃరావు, ఉప తహసిల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటుకు చర్యలు
ప్రజాశక్తి -అనంతగిరి: కుల, జనన ధ్రువీకరణ పత్రాలు, కొత్త ఆధార్డ నమోదు ప్రక్రియకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్థానిక ఎంపీడీవో ఏ వివి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ రాయితీలు పొందుకోలేని వారికి ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని 24 పంచాయతీ పరిధి ప్రజలకు ప్రత్యేక ఆదార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నిర్దిష్ట సమయంలో ధ్రువపత్రాల అందజేత
ప్రజాశక్తి-చింతపల్లి: లబ్ధిదారులకు కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యం లేకుండా, నిర్దిష్ట సమయానికి అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చింతపల్లి ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, సామాజిక పింఛన్ పంపిణీ, కొత్త పింఛన్ దారుల గుర్తింపు, పలు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారులకు ఆధార్ నమోదు, ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్, పీఎం జెజెవై, పీఎం వీవై, పీఎం ఎస్‌బీవై, పిజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, మారుమూల గిరిజన గ్రామాలలో దోమలు వృద్ధి చెంది ప్రబలకుండా దోమల పిచికారీ (స్ప్రేయింగ్) వంటి కార్యక్రమాలను పూర్తి చేయడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం లేకుండా ముందుండి పనిచేయాలని సూచించారు. మన మిత్ర కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకత, సమర్థత పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక భవనం పనులకు శంకుస్థాపన
ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో సీకరీ గ్రామంలో సామాజిక భవన నిర్మాణానికి బుధవారం మాజీ ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుల్లెల కృష్ణారావు, ఎంపిటిసి వంతల ఆనంద రావు, వైస్ ఎంపీపీ కొర్ర రాజబాబు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు మజ్జి చంద్రబాబు, కొర్ర కనకరాజు, గ్రామ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఫాల్గుణ

బాధిత కుటుంబాలకు అండ :మం త్రి నాదెండ్ల
ప్రజాశక్తి- విశాఖపట్నం: పవిత్రమైన సింహాచలంలో ఇలాంటి సంఘటన దురదష్టకరమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల్లో ఇద్దరు జనసేన క్రియాశీల కార్యకర్తలు ఉన్నారని, వారి మరణం పార్టీకి తీరనిలోటన్నారు. కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుడు, జనసేన క్రియాశీలక సభ్యుడు పత్తి దుర్గాస్వామి నాయుడు తండ్రి పత్తి దత్తుడును ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సింహాచలం ఘటనపై ఉదయం నుంచి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ సమీక్షిస్తున్నారన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తామని, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.. సంఘటనపై పూర్తి విచారణ జరిపిస్తున్నామన్నారు



ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ కలెక్టరేట్: చందనోత్సవ వేళ సింహాద్రి అప్పన్న సన్నిధిలో అపశృతి చోటుచేసుకుంది. అప్పన్న నిజరూప దర్శనానికి బుధవారం వేకువజామున భక్తులు రూ.300 ప్రత్యేక దర్శనం క్యూలైన్లలో నిలుచున్న సమయంలో ఇటీవలే నిర్మించిన గోడ ఒక్కసారిగా కూలి భక్తులపై పడడంతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. మరో పదిమందికి గాయాలయ్యాయి. ప్రసాదం పథకం కింద సింహాచలం కొండపై జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా గోడను నిర్మించారు. కొండపైన సింహగిరి బస్‌స్టాండ్ నుంచి ఎగువకు వెళ్లేమార్గంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చందనోత్సవానికి కొన్నాళ్లుగా అధికారయంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లలో వైఫల్యమే ప్రమాదానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది సైతం సామాన్య భక్తులకు ఇబ్బందులకు గురిచేసిన యంత్రాంగం, వాటిని అధిగమించి మెరుగైన ఏర్పాట్లు చేయాల్సింది పోయి, మరింత నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఏడుగురు ప్రాణాలు పోయాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కొండపైకి దర్శనాలకు వెళ్లేందుకు ప్రయివేటు వాహనాలకు అనుమతి లేదంటూనే, కార్లకు ఇష్టానుసారంగా పాస్‌లు జారీ చేశారని, వివిఐపిలకు పెద్దపీట వేసి, సామాన్య భక్తులను మాత్రం గంటల తరబడి ఉచిత బస్సుల్లో పడిగాపులు పడేలా చేశారనే విమర్శలున్నాయి. ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన తర్వాత హడావిడి నేతలు, అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటే బాగుండేదని పలువురు అంటున్నారు.

మృతుల్లో స్టీల్ ప్లాంట్ ఉద్యోగి
సింహాచలం ప్రమాద సంఘటనలో అడవివరానికి చెందిన ఎడ్ల వెంకటరావు (58) మృతి చెందారు. మృతుడు స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్ విభాగంలో పర్మినెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య రత్నకుమారి నగరంలోని ప్రముఖ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్నారు. వెంకటరావు మృతితో అడవివరంలోనూ, స్టీల్‌ప్లాంట్‌లోని సంబంధిత విభాగంలో విషాదం అలుముకుంది. మృతునికి ఇద్దరు కుమారులు కాగా, వారిలోఒకరు డాక్టర్, మరొకరు ఇంజినీరుగా బెంగళూరులో స్థిరపడ్డారు.

మృతులకు రూ.25 లక్షల పరిహారం
రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత
విశాఖ కలెక్టరేట్ : గాలి వాన బీభత్సానికి, సింహాచలం చందనోత్సవం ప్రాంతంలో గోడ కూలి భక్తులు చనిపోవటం దురదృష్టకరమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు.బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి కెజిహెచ్ మార్చురీ వద్ద మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాత్రి 2.30 గంటలకు ఘటన జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదంలో ఏడుగురు మరణించారని, మరి కొంతమంది గాయపడ్డారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.3 లక్షలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిహారం ఇస్తామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యానికి జిల్లా వైద్యాధికారులకు ఆదేశించామన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రమాదంపై విచారణకు త్రిసభ్య కమిటీ వేశామని, 72గంటల్లో కమిటీ నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.కోటి పరిహారం, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలి : సిపిఎం
చందనోత్సవం ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం, బాధిత కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉపాధి కల్పించాలని సిపిఎం జాతీయ కమిటీ సభ్యులు కె. లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను సిపిఎం నేతలు పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెబుతూ, ఓదార్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో నలుగురు మరణించడం అత్యంత బాధాకరమన్నారు. చిన్నపాటి వర్షానికే గోడ కూలిందంటే దాని నిర్మాణంలో నాణ్యతాలోపం, అక్రమాలు ఎంతున్నాయో తెలుస్తోందన్నారు. ఈ అవినీతిలో అధికారులు, ప్రభుత్వం పాత్రపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఇటువంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యమేనని మండిపడ్డారు. సిపిఎం జిల్లా నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, బి వెంకటరావు, బి. జగన్, ఎం సుబ్బారావు, కె చంద్ర శేఖర్ ఉన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేత లోకనాథం, తదితరులు

అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్ర దిగ్భ్రాంతి
సింహాచలం దేవస్థానంలో చందనోత్సవం సందర్భంగా గోడకూలి ఏడుగురు భక్తులు మరణించడంపై సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తుంది. మృతులకు సంతాపం, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు విడుదల చేసిన ప్రకటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడం బాధాకరమన్నారు. ఇటీవల తిరుపతిలో జరిగిన ఘటన నుంచి గుణపాఠం నేర్చుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే తాజా ఘటనకు కారణమన్నారు. చందనోత్సవానికి ముగ్గురు మంత్రులతో వేసిన కమిటీ సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడం వలనే దుర్ఘటన జరిగిందన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరణంలోనూ మిత్రులిద్దరూ ఒక్కటిగా...
సింహాచలం అప్పన్న సన్నిధిలో జరిగిన ప్రమాదంలో ఇంటీరియర్ డిజైనర్ పత్తి దుర్గస్వామి నాయుడు (32) సహా అతని స్నేహితుడు కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (29) ప్రాణాలు కోల్పోయారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొర్లపాటివారిపాలేనికి చెందిన పత్తి దుర్గ స్వామినాయుడు మూడేళ్లుగా విశాఖలోని సీతమ్మధారలో నివాసముంటూ, ఇంటీరియర్ డిజైన్ షాపు నిర్వహిస్తున్నారు. చందనోత్సవానికి వెళ్లి అక్కడ గోడ కూలిన ఘటనలో వీరు మృతి చెందడంపై కొర్లపాటివారిపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్నేహితులిద్దరూ ఒకే ఘటనలో ఒకేసారి మృత్యువాత పడడం విశేషం.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే దుర్ఘటన
- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్
చందనోత్సవంలో దుర్ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. కెజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సింహాచలం చందనోత్సవానికి ఆంధ్రాతోపాటు ఒడిశా, తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి మూడు లక్షల వరకు భక్తులు వస్తారని తెలిసినా, ఏర్పాటల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కేవలం మూడు, నాలుగు రోజుల క్రితం కట్టిన గోడల పక్కనే క్యూలైన్లు ఏర్పాట్లు నిర్లక్ష్యమేనన్నారు. కొండ చరియలు ఉన్న ప్రాంతాల్లో కాంక్రీట్ రిటైనింగ్ వాల్స్ కట్టాల్సి ఉండగా అలా చేయలేదన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఏం జరిగిందో భక్తులు తెలుసుకోలేని పరిస్థితి నెలకొనడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించడం సరికాదని, మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. బాధిత కుటుంబీకులను పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయ్ కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, విజయనగరం జెడ్‌పి చైర్మన్ చిన్న శ్రీను, డిప్యూటీ మేయర్లు జియాని శ్రీధర్, కట్టమూరి సతీష్, ద్రోణంరాజు శ్రీవాస్తవ్, కొండ రాజీవ్, రవిరెడ్డి, పేడాడ రమణకుమారి పాల్గొన్నారు.